ఆక్రమణల నుంచి పెద్ద చెరువును కాపాడండి



చెరువు నాలాల మ్యాప్‌ను కమిషనర్‌కు చూపిస్తున్న ఆకుల సతీష్

నిజాంపేట, సెప్టెంబర్ 26(ఆంధ్రజ్యోతి): బాచుపల్లి రెడ్డీస్ ల్యాబ్ నుంచి బ్లాక్ డైమండ్ కాలనీ మీదుగా బాచుపల్లి పెద్ద చెరువులోకి వచ్చే నాలా ఆక్రమణను తొలగించి, వర్షపు నీరు చెరువులోకి చేరేలా చర్యలు తీసుకోవాలని బాచుపల్లి ముదిరాజ్ సంఘ సభ్యులు నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీష్‌తో కలిసి కార్పొరేషన్ కమిషనర్ సౌజన్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆకుల సతీష్ మాట్లాడుతూ, 50 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న బాచుపల్లి పెద్ద చెరువులోకి వర్షపు నీరు చేరేదని, చెరువుకు సంబంధించిన రెండు ప్రధాన నాలాలు పూర్తిగా ఆక్రమణకు గురయ్యాయని తెలిపారు. రెడ్డీ ల్యాబ్స్ నుంచి వచ్చే నాలాను కొందరు ఆక్రమించుకొని చెరువులోకి వర్షపు నీరు చేరకుండా మురుగు కాలువ ద్వారా మల్లంపేట చెరువులోకి మళ్లించారని కమిషనర్‌కు తెలిపారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి నాలాపై అక్రమంగా నిర్మించిన రోడ్లు, నిర్మాణాలను తొలగించి బాచుపల్లి పెద్ద చెరువులోకి వర్షపు నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అలాగే చెరువుపై ఆధారపడి జీవించే ముదిరాజ్‌లను రక్షించాలని కోరారు.



నూతన కార్యవర్గ సభ్యులు

మేడ్చల్ జిల్లా ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల కార్యవర్గం ఎంపిక

దుండిగల్, సెప్టెంబర్ 26(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల నూతన కార్యవర్గం గురువారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సీహెచ్ విద్యాసాగర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎం. సిద్ధిరామ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ఎం గోపి, కోశాధికారిగా కెచంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శిగా ఎమురళీ, రాష్ట్ర కౌన్సిలర్ గా ఎ. ఉపేందర్, పీవీ రమణారెడ్డి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా డి. నాగేందర్,ఉమాదేవి వ్యవహరించారు.

ట్రాఫిక్‌కు ఇబ్బంది రానీయొద్దు : ఏసీపీ



ప్రాజెక్టు అధికారులతో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 26(ఆంధ్రజ్యోతి): బోయినపల్లి నుంచి కొంపల్లి మీదుగా కండ్లకోయ వరకు చేపడుతున్న జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా చేపట్టిన ఫ్లైఓవర్ పనులను ప్రాజెక్టు అధికారులతో కలిసి మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ పనుల వల్ల ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగకుండా చూడాలని ఏసీపీ వెంకట్‌రెడ్డి ప్రాజెక్టు అధికారులకు సూచించారు. సర్వీస్ రోడ్డులో అసంపూర్తిగా ఉన్న పనులను త్వరగా పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకు వస్తే ట్రాఫిక్‌కు ఇబ్బంది ఉండదని వారికి సూచించారు. కార్యక్రమంలో అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు, జాతీయ రహదారి ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్, మేనేజర్ రాఘవేందర్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : ఎమ్మెల్సీ



శంభీపూర్ రాజును కలిసిన కాలనీల ప్రజలు

దుండిగల్, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి ఎళ్లవేళలా కృషి చేస్తానని ఎమ్మెల్సీ మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలు బస్తీలు, కాలనీల వాసులు స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో ఎమ్మెల్సీని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం శంభీపూర్ రాజు పలు శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఆయా బస్తీలు, కాలనీల్లోని సమస్యలను పరిష్కరించాలని కోరారు.

గాగిల్లాపూర్ తండాలో 'స్వచ్ఛత సేవ'



పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు వివరిస్తున్న కమిషనర్ సత్యనారాయణ

దుండిగల్, సెప్టెంబర్ 26(ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపల్ పరిధిలోని గాగిల్లాపూర్ తండాలో కమిషనర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛత సేవ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సమాజంలో ప్లాస్టిక్ బ్యాగ్‌ల నిర్మూలనలో భాగంగా జూట్ బ్యాగ్‌లు తయారీపై మహిళా గ్రూప్ సభ్యులచే వివరించారు. అదే విధంగా పాఠశాల విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం పరిసరాలను ఎలా శుభ్రంగా ఉంచుకోవాలో అనేది విద్యార్థులచే పాటలు, డ్యాన్స్‌ల ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ పి. స్వాతిక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచందర్, శాంతి, వార్డు ఆఫీసర్లు రవీందర్, ప్రవీన్, రమేష్, జవాన్‌లు పాల్గొన్నారు.

బ్రోచర్ ఆవిష్కరణ



హైదర్‌నగర్, సెప్టెంబర్ 26(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కళాశాలలో నవంబర్ 9,10న జరిగే 11వ నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్స్ సమావేశం బ్రోచర్‌ను పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఆర్ఎస్‌వి బద్రీనాథ్, వీవీ రావు, ఈశ్వరి, ఉదయ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): కొంపల్లి సబ్-స్టేషన్ పరిధిలో 11కేవీ ఫీడర్లు మరమ్మతు పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ ఉండదని ఏఈ ఒక వినాయక్ రాథోడ్ ఒక ప్రకటనలో తెలిపారు. అపర్ణ, జీబీఆర్, కొంపల్లి, డోలార్‌ధనీ, న్యూజీవీడు, దూలపల్లి ఫీడర్లలో పరిధిలోని కాలనీలు, బస్తీ విద్యుత్ ఉండదని వినియోగ దారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలన్నారు.

పెన్షనర్ల దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి: రాంరెడ్డి

ఓల్డ్‌బోయినపల్లి, సెప్టెంబర్ 26(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ఆదేశానుసారం అధిక పెన్షన్ అర్హత ఉన్న వారందరికీ జాప్యం లేకుండా పెన్షన్‌ను వెంటనే అమలు చేయాలని ఈపీఎస్ -95 పెన్షనర్లు దేశవ్యాప్తంగా చేపట్టిన నిరసన ధర్నాను విజయవంతం చేయాలని ఎన్ఏసీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి పెన్షనర్లకు పిలుపునిచ్చారు. నేషనల్ ఎజిటేషన్ కమిటీ(ఎన్ఏజీ) జాతీయ అధ్యక్షుడు కమాండర్ అశోక్‌రావత్ పిలుపు మేరకు నగరంలోని బర్కత్‌పుర, కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్ బస్టాండ్ వద్ద ఉన్న పీఎఫ్ కార్యాలయం వద్ద ఈ నిరసన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. నగరంలో పాటు రాష్ట్రంలో ఉన్న అన్ని పీఎఫ్ కార్యాలయాల వద్ద ఈ నిరసన జరుగుతుందని ఆయన వెల్లడించారు.

వీర వనిత చాకలి ఐలమ్మకు ఘన నివాళి



ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు తదితరులు

దుండిగల్/బాలానగర్ / చందానగర్, సెప్టెంబర్ 26(ఆంధ్రజ్యోతి): భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి నుంచి విముక్తి కోసం పోరాడి, తెలంగాణ తెగువను ప్రపంచానికి చాటి చెప్పిన వీర వనిత చాకలి ఐలమ్మ పలువురు కొనియాడారు. సమాజంలో ఉన్న అసమానతలను తొలగించేందుకు చాకలి ఐలమ్మను యువత ఆదర్శంగా తీసుకుని మార్పు కోసం కృషి చేయలన్నారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆమె చిత్రపటానికి, విగ్రహాలకు రజక సంఘాల ఆధ్వర్యంలో పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, వివిధ పార్టీల నాయకులు, ఐలమ్మకు నివాళులర్పించారు.

● బౌరంపేటలో ఐలమ్మ చిత్ర పటానికి రజక సంఘం నాయకులతో కలిసి బౌరంపేట కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి నివాళులర్పించారు. రజక సంఘం నాయకులు సత్తెయ్య, జీతయ్య, అశోక్, నర్సింహ, అంజయ్య, రాజు పాల్గొన్నారు. మూసాపేటలో జరిగిన వేడుకల్లో కాంగ్రెస్ ఇన్‌చార్జి బండిరమేష్‌తో ఏ బ్లాక్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. బాలానగర్, ఫతేనగర్ రజకసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మాజీ కార్పొరేటర్ కాండూరి నరేంద్రాచార్యతో సంఘం నాయకులు బాలకృష్ణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు. బాలానగర్ శ్రీశ్రీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఐలమ్మ జయంతి నిర్వహించారు. చందానగర్ సర్కిల్ కార్యాలయంలో ఏఎంసీ విజయ్‌కుమార్, కృష్ణ ఆధ్వర్యంలో ఐలమ్మ జయంతిని జరుపుకున్నారు. గాంధీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఐలమ్మ చిత్ర పటానికి కాంగ్రెస్ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న బౌరంపేట కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు



మూసాపేటలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ ఇన్‌చార్జి బండిరమేష్, పట్లోళ్ల నాగిరెడ్డి



చందానగర్ సర్కిల్ కార్యాలయంలో.. డీసీ మోహన్‌రెడ్డి, అధికారులు



గాంధీ భవన్‌లో జరిగిన వేడుకల్లో.. సత్యం శ్రీరంగం తదితరులు



బాలానగర్‌లోని సీపీఐ కార్యాలయంలో..



బాలానగర్ రజక సంఘం ఆధ్వర్యంలో ..

కిశోర బాలికలు పౌష్టికాహారాన్ని సమృద్ధిగా తీసుకోవాలి

బాలానగర్, సెప్టెంబర్ 26(ఆంధ్రజ్యోతి): కిశోర(కౌమార) దశలో పెరుగుదల వేగంగా ఉంటుందని, ఈ దశలో ఆరోగ్యంగా ఉండడానికి బాలికలు అవసరమయ్యే పోషక పదార్థాలను క్రమం తప్పకుండా తీసుకోవాలని హస్మత్‌పేట్ సెక్టార్ ఐసీడీఎస్ అంగన్‌వాడీ సూపర్ వైజర్ స్వరూప సూచించారు. పౌష్టికాహార మాసం(సెప్టెంబర్ 1 నుంచి 30) సందర్భంగా బాలానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కిశోర బాలికలకు పౌష్టికాహారంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పాల్గొని పలు విషయాలను బాలికలకు వివరించారు. పప్పు ధాన్యాలు, ఆకు కూరలు, పండ్లు, చిరుధాన్యాలు సమృద్ధిగా తీసుకుంటూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. ఈ సదస్సులో అంగన్ వాడీ టీచర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నియంత్రణపై దృష్టి పెట్టండి

ఫతేనగర్, సెప్టెంబర్ 26(ఆంధ్రజ్యోతి): విష జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో స్థానికులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండిరమేష్ సూచించారు. గురువారం ఉదయం కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్, మయూర్ మార్గ్‌లో పార్టీ నాయకులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులను అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దోమల నియంత్రణ, మురుగునీరు, కలుషిత నీటి సమస్యలపై జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది దృష్టి పెట్టాలని సూచించారు.



వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు

గీతంలో పైలట్ శిక్షణపై వర్క్‌షాప్

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబర్ 26: గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగంలో 'ఫ్లైట్ సిమ్యులేటర్'పై ఒకరోజు పైలెట్ శిక్షణ వర్క్‌షాప్ జరిగింది. స్పేస్‌జెన్ సీఈఓ కెప్టెన్ విగో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా విమానం నిలిపిన ప్రదేశం నుంచి పైకి ఎగిరే వరకు మొత్తం ప్రక్రియపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విమానాన్ని నియంత్రించడం, గాలిలో ప్రయాణిస్తూ చేసే విన్యాసాలు, గాలిలో ఉండగానే ఇంజన్ ఆపి డిప్ స్టిక్ ల్యాండింగ్ చేయడం వంటివి చేసి చూపి, ఫ్లైట్ సిమ్యులేటర్ అనుభవాన్ని విద్యార్థులకు కల్పించారు. తమ ఏరోనాటికల్ సొసైటీ ఆధ్వర్యంలో ఎయిర్ ఇండియా, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్, భారత వైమానిక దళం స్టేషన్ల సందర్శన ఏర్పాటు చేస్తామని చెప్పారు. దుండిగల్ ఎయిర్ ఫోర్స్ అకాడమీ సందర్శనతో పాటు అక్కడి పైలట్లతో ముఖాముఖి సంభాషణను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. అధ్యక్షత వహించిన స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్, డీన్ కోర్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ రామశాస్త్రి వేదాల మాట్లాడారు. కార్యక్రమంలో ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎండీ.అక్తర్ ఖాన్, కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ ఎస్.కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడండి

● అధికారులకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశం



ఇంజనీరింగ్, వాటర్‌వర్క్స్ అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే కృష్ణారావు

హైదర్‌నగర్, సెప్టెంబర్26(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఎక్కడా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తాగునీరు, డ్రైనేజీ, రోడ్ల మరమ్మతు పనులు చేపట్టాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులను ఆదేశించారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇంజనీరింగ్, వాటర్‌వర్క్స్ అధికారులతో గురువారం ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతిన్నాయన్నారు. మంచినీటి పైపులైన్లు సరిగా లేకపోవడంతో నీళ్లు రావడం లేదని ఫిర్యాదులు అందాయని తెలిపారు. అధికారులు అందరూ రాబోయే పండుగలను దృష్టిలో ఉంచుకుని రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి వ్యవస్థ పనులు ముమ్మరం చేయాలన్నారు. అదేవిధంగా నూతన రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి వ్యవస్థ వేయడానికి కావాల్సిన నిధుల కోసం అంచనాలను తయారు చేయాలని సూచించారు. బతుకమ్మ పండుగకు రంగదాముని చెరువు వద్ద కావాల్సిన ఏర్పాట్లు చేయాలని, ఆడపడుచులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాబూరావు, ఇంజనీరింగ్ ఈఈ గోవర్ధన్, శ్రీనివాస్, డీఈలు శ్రీదేవి, శంకర్, ఏఈలు, వాటర్‌వర్క్స్ జీఎం ప్రభాకర్, డీజీఎంలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అక్రమార్కులపై బల్దియా నజర్

● ఆంధ్రజ్యోతి కథనంపై ఉద్యోగుల్లో భయం
● కేపీహెచ్‌బీ టీపీఎస్‌పై వేటు ?

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి) : అక్రమ భవనాలను సక్రమం చేస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులపై వేటుకు రంగం సిద్ధమైంది. "డబ్బులు ఇస్తే అక్రమ భవనాలను సీజ్ చేయం" అనే శీర్షికతో మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై బల్దియా ఉన్నతాధికారులు ఆరా తీశారు. కూకట్‌పల్లి, మూసాపేట సర్కిల్ పరిధిలో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టీం ఎన్ని భవనాలను సీజ్ చేసింది. సీజ్ చేసిన భవనాల్లో పనులు చేసుకోమని భరోసా ఇచ్చిన టౌన్‌ప్లానింగ్ ఉద్యోగి ఎవరు? అసలు నోటీసులు ఇవ్వకుండా, సీజ్ కాకుండా చూస్తున్న ఆ టీపీఎస్ ఎవరు అనే దానిపై ప్రాథమిక నివేదిక సిద్ధం చేసినట్లు తెలిసింది. ఐఏఎస్ అయితే మీకేంటి? నేను అడిగింది నాకు ముట్టచెప్తేనేనే చూసుకుంటానని చెప్పిన సదరు టీపీఎస్‌పై జోనల్ స్థాయిలోనే కాదు.. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆ శాఖకు చెందిన ఉన్నతాధికారులు కూడా సీరియస్‌గా తీసుకున్నారట. అక్రమార్కుల అధికారుల జాబితాలో కేపీహెచ్‌బీ, బాలాజీనగర్ టీపీఎస్ ఉన్నట్లు తేల్చారు. దీంతో ఆయనపై వేటు వేయాలని, దీంతో అవినీతి అధికారులను దారిలో పెట్టవచ్చనే ఆలోచనలో ఉన్నతాధికారులు సమాలోచనల్లో మునిగి తేలారు. సర్కిళ్ల పరిధిలోని డివిజన్ల వారీగా ఎన్ని అక్రమ నిర్మాణాలు ఉన్నాయి. నోటీసులు ఎందుకు ఇవ్వలేకపోయారు ? నోటీసులు అందుకున్నా పనులు చేస్తుంటే మీరు ఏం చేస్తున్నారు? తదితర అన్నీ కోణాల్లో నివేదిక తెప్పించుకునే పనిలో జెడ్సీ ఉన్నారట. అక్రమ నిర్మాణాలకు ఆ మ్యామ్యాలు పుచ్చుకొని అండ గా నిలుస్తున్న అధికారులపై చర్యలు ఉంటాయని బల్దియా అధికారులు చెప్పుకుంటున్నారు.

కల్తీ నెయ్యితో లడ్డూ తయారీపై నిరసన

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి దేవస్థానంలో కల్తీనెయ్యితో లడ్డూ తయారీపై మంగళవారం సనాతన ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీ గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని ఆవుపాలతో శుభ్రం చేసి, కొబ్బరి కాయలు కొట్టి పూజలు చేశారు. గోవింద.. గోవింద అంటూ ప్రదక్షిణలు చేశారు. సంస్థ కన్వీనర్ మధుగౌడ్ మాట్లాడుతూ, హిందువులలో ఐక్యత ఉందని చెప్పడానికి ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. తిరుపతి పాలకవర్గంలో ఇతర మత ఉద్యోగులకు వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గురుప్రసాద్, వినోద్ గౌడ్, శివరామకృష్ణ, గణపతి, వేణుగోపాల్, రవి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలంటూ బాధితుల ధర్నా

● చిట్టీల పేరుతో రూ.5 కోట్లతో ఉడాయించిన మహిళ
● మోసం చేసిన మహిళపై చర్యలు తీసుకోవడంలో పోలీసు తాత్సారం
● మహిళ ఇంటి ముందు బాధితుల ఆందోళన



ధర్నా చేస్తున్న బాధితులు

జీడిమెట్ల, సెప్టెంబర్ 26(ఆంధ్రజ్యోతి): చిట్టీల పేరుతో ఐదు కోట్ల రూపాయాల వరకు మోసం చేసి పారిపోయిన మహిళను అతని, భర్తను శిక్షించాలని బాధితులు డిమాండ్ చేశారు. తమకు న్యాయం చేయాలంటూ సదరు మహిళ ఇంటి ముందు గురువారం సాయంత్రం బాధిత మహిళలు ధర్నా నిర్వహించారు. తమను మోసం చేసిన మహిళపై చర్యలు తీసుకోవాల్సిన జీడిమెట్ల పోలీసులు పట్టించుకోవడం లేదని వారు వాపోయారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... వినుకొండ పేర్లపాడుకు చెందిన మేకల నాగమున్నయ్య(45), నర్సారావుపేట సాతులూరుకు చెందిన నాగమణిలు భార్యాభర్తలు. వీరు కుత్బుల్లాపూర్ ప్రాంతంలోని వెంకటేశ్వరనగర్‌లో 15 సంవత్సరాలుగా నివాసముంటున్నారు. అందరితో ఎంతో మంచిగా ఉన్నట్టు నటించిన నాగమణి చిట్టీల వ్యాపారం చేసింది. మొదట్లో అందరికీ సకాలంలో డబ్బులు ఇవ్వడంతో అందరూ ఆమెను నమ్మారు. ఆరు నెలల క్రితం చిట్టీల వ్యాపారం ముసుగులో అప్పులు చేసి కుటుంబం మొత్తం పారిపోయింది. ఇల్లు కూడా బ్యాంకులోన్‌లో ఉండటంతో బ్యాంక్ అధికారులు ఆధీనంలోకి తీసుకున్నారు. నాగమణి చేతిలో మోసపోయిన దాదాపు 45 మంది గురువారం తమకు న్యాయం చేయాలని ధర్నా చేశారు. తమకు న్యాయం జరిగేంత వరకు పోరాడతామని, నాగమణిని కఠినంగా శిక్షించాలని కోరారు.

అనుసంధాన రోడ్లతో ట్రాఫిక్ తగ్గుతుంది



రిబ్బన్ కట్‌చేసి అనుసంధాన రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

దుండిగల్, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): అనుసంధాన రోడ్లతో ప్రధాన రోడ్లలో ట్రాఫిక్ తగ్గుతుందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. గురువారం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బహదూర్‌పల్లి, బౌరంపేట రహదారిలో రూ. 60 లక్షలతో సీడీపీ నిధులతో నూతనంగా నిర్మించిన అనుసంధాన రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనుసంధాన రోడ్లను అభివృద్ధి చేస్తే ప్రధాన రోడ్లల్లో ట్రాఫిక్ తగ్గుతుందని, ఆ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కుత్బుల్లాపూర్ నియోజక వర్గాన్ని అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ను వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, భరత్, దుండిగల్ కమిషనర్ సత్యనారాయణరావు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

పేదలకు కొండంత అండ సీఎంఆర్ఎఫ్

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 26(ఆంధ్రజ్యోతి): పేదలకు కొండంత అండ సీఎం సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) అని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంటసర్కిళ్ల పరిధిలోని ఆరోగ్య పరిస్థితి బాగా లేని ముగ్గురికి వైద్య చికిత్సల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన ఎల్‌ఓసీలను ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ గురువారం పంపిణీ చేశారు. సంజయ్‌గాంధీనగర్‌కు చెందిన ఆర్. లక్ష్మి రూ. 2 లక్షలు, జీడిమెట్ల వెంకన్న హిల్స్‌కు చెందిన వెంకటేశ్వర్లు రూ. 2 లక్షలు, సుభాష్ నగర్‌కు చెందిన పి. నర్సింగరాజు రూ. 3 లక్షల ఎల్‌ఓసీలను అందజేశారు.



ఆల్విన్‌కాలనీ ఎల్లమ్మబండకు చెందిన సంతోష్‌కుమార్‌కు మంజూరైన సీఎం సహాయ నిధి రూ.లక్ష ఎల్‌ఓసీ పత్రాన్ని అతని కుటుంబ సభ్యులకు అందజేస్తున్న పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ.

(హైదర్‌నగర్-ఆంధ్రజ్యోతి)

పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం



లబ్ధిదారుకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసీ పత్రాలను అందజేస్తున్న శ్రీశైలంగౌడ్

షాపూర్‌నగర్, సెప్టెంబర్ 26(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరం లాంటిదని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. సుభాష్‌నగర్ డివిజన్ భాగ్యలక్ష్మి కాలనీకి చెందిన సారే సుమలతకు శస్త్ర చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 1.50 లక్షలను మంత్రి శ్రీధర్‌బాబు సిఫార్సుతో శ్రీశైలంగౌడ్ మంజూరు చేయించారు. ఇందుకు సంబంధించిన ఎల్‌ఓసీ పత్రాలను గురువారం ఆయన తన నివాసంలో లబ్ధిదారు సుమలతకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్‌గౌడ్, బుచ్చిరెడ్డి, ఐలయ్య, జనార్ధన్, జగన్, కృష్ణారెడ్డి, జహీర్‌భాయి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లెనిన్‌నగర్‌లో జోనల్ కమిషనర్ పర్యటన

గాజులరామారం, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): గాజులరామారం డివిజన్‌లోని లెనిన్‌నగర్, శ్రీనివాస్‌నగర్‌ల్లో జోనల్ కమిషనర్ అపూర్వచౌహాన్ గురువారం పర్యటించారు. లెనిన్ నగర్‌లో నూతనంగా మంజూరైన కమ్యూనిటీహాల్, మార్కెట్‌యార్డ్ కోసం జోనల్ కమిషనర్ స్థల పరిశీలన చేశారు. కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంత్‌రెడ్డి అభ్యర్థన మేరకు అధికారులు స్థల పరిశీలనకు వచ్చారు. కార్యక్రమంలో గాజులరామారం డీసీ మల్లారెడ్డి, కాంగ్రెస్ నాయకులు సిద్దినోళ్ల సంజీవ రెడ్డి, మాజీ వార్డు మెంబర్ శ్రీనివాసరావు, బస్తీ వాసులు వెంకటేష్, రవిచారి, శ్యామ్, రాజిరెడ్డి, శ్రీనివాస్, యాదవ్ పాల్గొన్నారు.

సురేష్‌నాయక్ కుటుంబానికి పార్టీ అండ

● పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్



సురేష్‌నాయక్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పీసీసీ అధ్యక్షుడు

గచ్చిబౌలి,సెప్టెంబర్ 26(ఆంధ్రజ్యోతి): మాదాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేవవత్ సురేష్‌నాయక్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఇటీవల సురేష్‌నాయక్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఈవిషయం తెలుసుకున్న పీసీసీ అధ్యక్షుడు నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్‌తో కలిసి ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. సురేష్‌నాయక్ ఆకాల మరణం పార్టీకి తీరని లోటని, నియోజకవర్గంలో పార్టీకి ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. వారి కుటుంబానికి పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీసీఈస అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, ఎంబీసీ చైర్మన్ జేరిపేటి జైపాల్ , మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే లైసెన్స్ రద్దు

● ప్రైవేట్ బస్సు డ్రైవర్లకు పోలీసు కమిషనర్ హెచ్చరిక

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన ప్రైవేట్ బస్సు డ్రైవర్‌ల లైసెన్స్ సస్పెండ్ చేయడంతోపాటు తీవ్రత మేరకు లైసెన్స్ రద్దు చేస్తామని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి హెచ్చరించారు. గచ్చిబౌలి కమిషనరేట్‌లో గురువారం ప్రైవేట్ ట్రావెల్ బస్సుల నిర్వాహకులతో ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రైవేట్ ట్రావెల్ బస్సుల డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం లేదని, ఉల్లంఘనులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముందుగా ట్రాఫిక్ నిబంధనల గురించి ప్రైవేటు బస్ డ్రైవర్లకు అవగాహన కలిగించాలని, తరచూ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. స్మగ్లర్లు ప్రైవేటు బస్సుల్లో గంజాయి, డ్రగ్స్ తరలిస్తున్నారని, ఈ విషయంలో నిర్వాహకులు జాగ్రత్తగా ఉండాలని టీజీన్యాబ్ ఎస్పీ పి.సాయిచైతన్య సూచించారు. సమావేశంలో తెలంగాణ స్టేట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కె ఇలంబర్తి, జాయింట్ సీపీ ట్రాఫిక్ డి జోయల్ డేవిస్ తదితరులు పాల్గొన్నారు.

టాఫిక్ చిక్కులకు చెక్ పెట్టేలా చర్యలు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): ఐటీ కారిడార్‌లో రోజురోజుకు పెరుగుతున్న వాహనాలకు తగిన విధంగా ట్రాఫిక్ నిర్వహణ జరగాలని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి అన్నారు. ట్రాఫిక్ సమస్య జటిలంగా ఉన్న జేఎన్‌టీయూ, యశోద ఆర్ అండ్ బీ రోడ్, సిద్ధివినాయక నగర్, మాదాపూర్, ఎన్ఐఏ సర్వీస్ రోడ్ తదితర ప్రాంతాల్లో జాయింట్ సీపీ జోయల్ డేవిస్, ఇతర అధికారులతో కలిసి క్షేత్రస్థాయి లో పరిస్థితులను పరిశీలించారు. ట్రాఫిక్ సక్రమంగా సాగేందుకు, అడ్డంకులను తొలిగించేందుకు జీహెచ్ఎంసీ, విద్యుత్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి కార్యచరణ రూపొందించాలని ఈ సందర్భంగా సీపీ అవినాష్ మహంతి సూచించారు.

పుష్పారెడ్డికి అభినందనల వెల్లువ



పుష్పారెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న పార్టీ మహిళా నేతలు, అభిమానులు

బాలానగర్, సెప్టెంబర్ 26 (ఆంధ్ర జ్యోతి): కూకట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా నియమితులైన కొండకింది పుష్పారెడ్డికి పార్టీ నాయకులు, అభిమానులు అభినందనలతో ముంచెత్తుతున్నారు. జననేత పీజేఆర్ నాటి నుంచి అయన శిష్యురాలుగా కాంగ్రెస్‌లోనే కొనసాగుతూ పార్టీకి ఆమె చేసిన సేవలను గుర్తించి ఆమెను మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా నియమించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. పుష్పారెడ్డిని శాలువాలు, పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.